

పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది... సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ ఇబ్బందికరంగా మారింది. గ్రామాల్లో ఏమైనా సమస్యలున్నా చెప్పుదామంటే అధికారులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభం, అపరిశుభ్రత పెరిగిపోవడం, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల స్తంభన, ప్రత్యేక అధికారుల అలసత్వం వల్ల గ్రామాలు చెత్తకుప్పలు, మురుగు కంపుతో రోగాల పుట్టగా మారుతున్నాయి. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా వంటివి వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పల్లెల్లో నెలకొన్నపారి శుధ్యంపై సిరి ప్రత్యేక కథనం...

# ప్రమాదంలో ప్రజారోగ్యం!

- గ్రామ పంచాయతీలకు నిధులు బంద్
- చెత్త కుప్పలైన పల్లెలు..రోగాల బారిన ప్రజలు
- పారిశుధ్యంపై అధికారుల నిర్లక్ష్యం..
- రోగాలకు నిలయంగా పల్లెలు
- ప్రజారోగ్యంపై యంత్రాంగం అలసత్వం...
- కళ్ల ముందు కనిపిస్తున్న ముప్పు.
- సీజనల్ వ్యాధులపై ప్రభుత్వానికి పట్టదా ?
- పాపన్నపేట మండలంలో మరీ దారుణం

### అధికారుల నిర్లక్ష్యం... కార్యదర్శులకు భయం...

ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు ఇస్తున్నా, అవి ఎక్కడా అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందోనని భయంతో, కార్యదర్శులు తమ జేబులోంచి డబ్బులు ఖర్చుపెట్టడానికి వెనుకాడుతున్నారు. గతంలో సమస్యల పరిష్కారానికి వెచ్చించిన డబ్బులు కూడా ఇప్పటివరకు తిరిగి చెల్లించబడలేదనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితులన్నిటినీ దృష్టిలో పెట్టుకుని, ప్రజలు స్వయంగా జాగ్రత్తలు తీసుకోవాలి, మేల్కొనాలి. తమ ఆరోగ్యం, గ్రామ పరిశుభ్రత కోసం ప్రజలే అప్రమత్తంగా ఉండాలి అని ఈ పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.



(పాపన్నపేట-సిరిన్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా ఇటు రాష్ట్రం నుంచి అటు కేంద్రం నుంచి పంచాయతీలకు నిధులు రావడం లేదు. ఇటీవల కాంగ్రెస్ సర్కారు ఎంతో ఆర్భాటంగా స్వచ్ఛదనంపచ్చదనం కార్యక్రమం నిర్వహించినప్పటికీ నయాపైసా ఇవ్వకపోవడంతో తూతూ మంత్రంగా జరిగిపోయింది. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా మురికి గుంతలు, చెత్తా చెదారంతో నిండిన వీధులు, పెరుగుతున్న పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసి 15 నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే, ఈ అధికారులు కేవలం పేరుకే పరిమితమై, గ్రామ సమస్యలను పూర్తిగా గాలికొదిలేశారు. చిన్న సమస్య వచ్చినా, దాన్ని పరిష్కరించే బాధ్యతను పంచాయతీ కార్యదర్శులపైనే మోపుతూ, వారిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. అంతేకాదు, జిల్లా పంచాయతీ అధికారులు ఏకంగా కార్యదర్శులను తమ సొంత డబ్బులు పెట్టుకుని పనులు చేయమని ఆదేశిస్తున్నారనే తీవ్ర ఆరోపణలున్నాయి.

### రోగాలకు రెడ్ కార్పెట్ వేసిన అధికారులు

నిధుల కొరత, అధికారుల నిర్లక్ష్యం గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యాన్ని పూర్తిగా నాశనం చేశాయి. పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఈ కీలక సమయంలో గ్రామాలు అపరిశుభ్రతతో విలవిలలాడుతున్నాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ చెత్త తడిసి, భయంకరమైన దుర్గంధాన్ని వెదజల్లుతోంది. పారిశుధ్యాన్ని మెరుగుపరచాలనే ఆలోచనే ఎవరికీ లేనట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పాపన్నపేట మండలంలోని గ్రామ పంచాయతీల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది.

### సీజనల్ వ్యాధుల ముప్పు...

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, పేరుకుపోయిన చెత్త కారణంగా సీజనల్ వ్యాధులు తీవ్ర స్థాయిలో ప్రబలే అవకాశం ఉంది. రోడ్లపై పేరుకుపోయిన చెత్తతో పాటు నిలిచిన మురుగునీరు దోమలు, ఈగల వృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. దీనివల్ల చిన్నాపిల్లలకు వైరల్ జ్వరాలు, ఇతర వ్యాధులతో తీవ్రంగా బాధపడే అవకాశం ఉంది అంతేకాకుండా, వయస్సు పైబడిన వృద్ధులు కూడా ఈ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ప్రజలు ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే, వెంటనే చెత్తను తొలగించి, మురుగునీటిని పారించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.